క్లుప్తంగా

యాదవ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా గంగాధర్



తానూరు: అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని బో రిగాం గ్రామానికి చెందిన జరిగోల్ల గంగాధర్ యాదవ్ ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని యాదవ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయనకు రాష్ట్ర కమిటీలో చోటు దక్కినట్లు ప్రకటించారు. గ్రామస్తులు మంగళవారం ఆయనను సన్మానించారు.

రేపు అడెల్లిలో వేలం

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం ప్రాంగణంలో నిర్వహించే వివిధ దుకాణాల నిర్వాహణకు ఏడాది కాలపరిమితితో గురువారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రవికిషన్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకనలో తెలిపారు. పాల్గొనే వ్యాపారులు వేలంపాటకు గంటముందు ఆలయ అధికారులు నిర్ణయించిన ధరావత్తు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

బీజేపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్, మాచాపూర్, మల్లాపూర్, మునిపెల్లి, వడ్యాల్ గ్రామాల నుంచి వివిధ పార్టీల నాయకులు మంగళవారం బీజేపీలో చేరారు. జిల్లా కేంద్రంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. మల్లాపూర్ సర్పంచ్ రవి, ఉపసర్పంచ్ అశోక్, శ్రీనివాస్, రాజారాం, ముత్యం, మునిపెల్లి వార్డు సభ్యులు నరేశ్, రాజ్‌కుమార్, నర్సారెడ్డి, వడ్యాల్ నుంచి దొడ్లే ప్రసాద్, పోతన్న పలువురు బీజేపీలో చేరారు. రావుల రాంనాథ్, భూపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గోవర్ధన్, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ స్ప్రేపై అవగాహన

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో సర్పంచ్ రత్నమాల వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం డ్రోన్ ద్వారా స్ప్రే చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో నవీన్ మాట్లాడుతూ డ్రోన్ స్ప్రే చేస్తే డబ్బులు ఆదా అవుతాయని పేర్కొన్నారు. దత్తు, మారుతి, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ అనుమతి తప్పనిసరి

దస్తురాబాద్: గణేశుడి మండపాలకు విద్యుత్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఏడీఈ కె.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం దస్తురాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో ఆయన మాట్లాడారు. అక్రమంగా వినియోగిస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. సబ్ ఇంజినీర్ నాగరాజు, సిబ్బంది ప్రేమ్, చరణ్‌దాస్, రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

‘ఓపెన్ విద్య’ సద్వినియోగం చేసుకోండి

భైంసాటౌన్: వివిధ కారణాలతో చదువు మధ్యలోనే మానేసినవారు ఓపెన్ పది, ఇంటర్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని భైంసా కోఆర్డినేటర్ సాప పండరి కోరారు. మంగళవారం భైంసా ఆర్టీసీ బస్టాండ్‌లో ఓపెన్‌విద్య, ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అలాగే డీఎం అమృతతో కలిసి కరపత్రాలు ప్రదర్శించారు. ఈనెల 21 వరకు ఓపెన్ పది, ఇంటర్‌లో ప్రవేశాలు పొందవచ్చని.. మీసేవ కేంద్రాల్లో సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వన్డే లీగ్‌లో నిర్మల్ జట్టు విజయం

నిర్మల్‌టౌన్: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వన్డే లీగ్ నిర్వహించగా మంగళవారం నిర్మల్, మంచిర్యాల జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో నిర్మల్ జట్టు విజయం సాధించింది. రాము, మహేష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారని నిర్మల్ జిల్లా జట్టు కోచ్ రామరాజు పేర్కొన్నారు.

వీవోఏలకు బీఎల్‌ఓ బాధ్యతలు

నర్సాపూర్(జి): అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె చేస్తుండటంతో ఓటరు నమోదు, సవరణల కోసం వీవోఏలకు బీఎల్‌ఓ బాధ్యతలు అప్పగించినట్లు తహసీల్దార్ గజానన్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్గరథం అందజేత

సోన్: మండల కేంద్రానికి చెందిన గాండ్ల చిన్నమ్మ–గంగయ్యల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు సోన్ వీడీసీకి స్వర్గరథం అందజేశారు. మంగళవారం గాండ్ల రాజేశ్వర్, నర్సయ్య, మహేశ్, సురేందర్ సోన్ వీడీసీ సభ్యులకు రథం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వినోద్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, గంగాధర్, ఉప సర్పంచ్ రాజేశ్వర్, శ్రీనివాస్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా నిర్మల్

- మంత్రి ఐకేరెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: ఆలయాల అభివృద్ధితో నిర్మల్ ఆధ్యాత్మిక కేంద్రంగా మారిందని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని దేవరకోట శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న సాలహారం, గ్రానైట్ నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి మాట్లాడుతూ.. దేవరకోట ఆలయం చాలా పురాతనమైనదని, కల్యాణ మండపానికి రూ.20 లక్షలు, షెడ్డుకు రూ.50 లక్షలు, ఆలయానికి రూ.1.20 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. పట్టణంలోనే 162 ఆలయాలను రూ.32.13 కోట్లతో పునర్నిర్మించినట్లు పేర్కొన్నారు. 80 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. అడెల్లి ఆలయాన్ని రూ.15 కోట్లతో కృష్ణ శిలలతో నిర్మిస్తున్నామన్నారు. విజయ దశమికి ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజి రాజేందర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, సీనియర్ నాయకులు పాకాల రాంచందర్, ఆరె నాగేష్, పూదరి శివ, ఆలయ ఈవో రవి కిషన్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కడెం నాయకులు

కడెం: జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మంత్రిని కడెం ఎంపీపీ అలెగ్జాండర్, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. ఈనెల 14న నిర్వహించే కడెం సర్వసభ్య సమావేశానికి రావాలని ఆహ్వానించారు.

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- భైంసా శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- పండుగల వేళ ప్రజలకు ఇబ్బంది రానివ్వద్దని అధికారులకు ఆదేశం
- సమన్వయంతో పని చేయాలని సూచన



భైంసాలో మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

భైంసారూరల్: ఇతరులకు ఇబ్బంది కల్గించకుండా పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం భైంసా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వినాయకచవితి, ఇతర పండుగలు వస్తున్న తరుణంలో ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు, విద్యుత్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించి సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్, భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ చౌహన్, డీఎంహెచ్‌ఓ ధన్‌రాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాబిర్‌అహ్మద్, ఉత్సవ సమితి నాయకులు విలాస్‌గాదేవార్, కౌన్సిలర్లు, ఆయా శాఖల అధికారులు, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

భైంసాటౌన్: వినాయక నవరాత్రోత్సవాల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్‌తో కలిసి మంగళవారం రాత్రి భైంసా పట్టణంలో శోభాయాత్ర మార్గం పరిశీలించారు. విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ తీగలు తగలకుండా విద్యుత్ శాఖ అధికారులతో మరమ్మతులు చేయించాలని సూచించారు. సీఐ శ్రీను ఉన్నారు.

ఖథ్‌గాం పంచాయతీ భవనం ప్రారంభం

భైంసారూరల్: మండలంలోని ఖథ్‌గాంలో రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఇప్పటికే పంచాయతీ పలు అవార్డులను దక్కించుకుందని.. ఐక్యతతో ముందుకెళ్తే మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. సర్పంచ్ రాజు, ఎంపీటీసీ మాణిక్‌రావు, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, ఎంపీవో మోజమ్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



కుంటాలలో ఆరోగ్య మహిళా కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుంటాల: మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని.. అందులో భాగంగానే మహిళా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కుంటాల పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కేంద్రంలో మహిళలకు ఎనిమిది రకాల వైద్యపరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారని.. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న, సర్పంచులు దొనికెన సమత వెంకటేశ్, మోరె ఆనందరావు పటేల్, సవ్వి అశోక్‌రెడ్డి, దత్తాద్రి, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిస్, జేఈ శ్రీకాంత్, ఎంపీటీసీ సునంద, రమణాగౌడ్, ముత్యంరెడ్డి, దశరథ్, రాజు, శంకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల మండలంలోని లింబా(కె) గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించే ఆరోగ్య ఉపకేంద్ర భవనానికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో కుమ్మరి శాలివాహన సంఘం భవన నిర్మాణానికి రూ.లక్షా50వేలు, కురుమ సంఘ భవన నిర్మాణం కోసం రూ.2లక్షల ప్రొసీడింగ్ కాపీని సంఘం సభ్యులకు అందజేశారు.

ముధోల్: మండల కేంద్రంలో రూ. 20లక్షలతో చేపట్టే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. త్వరలో బోరిగాం పీహెచ్‌సీకి భవనం మంజూరు చేస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు అఫ్రోజ్‌ఖాన్, వైద్యాధికారి ఆకాశ్, సర్పంచ్ రాజేందర్, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖాలీద్, ఎంపీటీసీలు సరళ శ్రీనివాస్‌గౌడ్, భూమేశ్, నాయకులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయండి’



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న ప్రకాశ్ రాథోడ్

భైంసాటౌన్: వచ్చే ఎన్నికల్లో ముధోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కర్ణాటక ఎమ్మెల్సీ, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు ప్రకాశ్ రాథోడ్ అన్నారు. భైంసాలో మంగళవారం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈనెల 17న హైదరాబాద్‌లోని తుక్కుగూడలో నిర్వహించే కార్యక్రమానికి సోనియాగాంధీ వస్తారని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనంద్‌రావు పటేల్, డా.కిరణ్ కుమార్, విజయ్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా సమావేశంలో వేదికపై తనకు కుర్చీ ఇవ్వకపోవడంపై విజయ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఖానాపూర్: సర్వేలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా రావడం శుభసూచకమని ఆ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ పరిశీలకులు ప్రకాశ్ రాథోడ్ అన్నారు. పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో ఎవరికీ టికెట్ వచ్చినా అందరూ వారికి సహకరించాలని కోరారు. హైదరాబాద్‌లో నిర్వహించే సభకు కాంగ్రెస్ అగ్రనేతలు హాజరవుతారన్నారు. మండలాధ్యక్షుడు దయానంద్, వెడ్మ బొజ్జు, భరత్‌చౌహన్, చంద్రశేఖర్, భక్షినాయక్, రాంకిషన్‌నాయక్, సునీల్ జాదవ్, కిశోర్‌నాయక్, బాపురావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

గౌడసంఘం మండల కార్యవర్గం



నూతన కార్యవర్గం

కడెం: గౌడ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు, గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో రేణుక ఎల్లమ్మతల్లి ఆలయంలో గౌడ సంఘ మండల కార్యవర్గం ఎన్నిక నిర్వహించగా ఆయన హాజరయ్యారు. గౌడ సంఘం మండల గౌరవ అధ్యక్షుడిగా ఆకుల రాజాగౌడ్, అధ్యక్షుడిగా లింగాపూర్‌కు చెందిన బొంగు వెంకాగౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా జాగిరి శ్రీనివాస్, ముంజ వెంకటరమణగౌడ్, ఉపాధ్యక్షులుగా సత్యగౌడ్, నారాయణగౌడ్, మల్లేశ్‌గౌడ్, శ్రీపతిగౌడ్, ప్రధాన కార్యదర్శులుగా శేఖర్‌గౌడ్, కార్యదర్శులుగా సత్యగౌడ్, వెంకగౌడ్, తిరుపతిగౌడ్, కోశాధికారిగా శ్రీనివాస్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్‌గౌడ్, రామగౌడ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

లోకేశ్వరం: మండలంలోని సేవాలాల్‌తండా ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు విష్ణుప్రియాంక, పాఠశాల అరవింద్‌ను మంగళవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల కృషితో జిల్లాలో ఉత్తమ పాఠశాలగా గుర్తింపు పొందింది. ఒకప్పుడు పాఠశాలలో కేవలం నలుగురు విద్యార్థులు మాత్రమే ఉండగా.. సిబ్బంది కృషితో వారి సంఖ్య 68కి చేరింది. కార్యక్రమంలో సర్పంచ్ యశోద బాయి, ఉపాధ్యాయుడు దేవేందర్‌రెడ్డి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

‘ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి’

నిర్మల్‌టౌన్: ఈనెల 18 నుంచి 22 వరకు నిర్వహించే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ శనిగారపు కమలాకర్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకొని.. నిజాయతీ చూపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 16న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే నిరాహార దీక్షకు మాదిగ ఉపకులాలు కలిసి రావాలని కోరారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు జిల్లా కేంద్రాల్లో దీక్షలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈనెల 17న నియోజకవర్గ కేంద్రాల్లో, 18న మండల కేంద్రాల్లో, 22 వరకు ఢిల్లీలో ఆందోళనలు కొనసాగిస్తామని.. అన్ని పార్టీల నాయకులు రావాలని పిలుపునిచ్చారు.

పొలాల పండుగకు సెలవివ్వాలి

కడెం: పొలాల అమావాస్య పండుగకు ప్రభుత్వం మూడు రోజుల సెలవులు ఇవ్వాలని నేతకాని సంఘం రాష్ట్ర నాయకుడు దుర్గె వెంకటేశ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నేతకాని సంఘం నాయకులు దుర్గం మల్లేశ్, వినోద్, పాముల గంగారాజం, గంగాధర్, కార్తీక్, తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో డ్రై డే

కుంటాల: అంబకంటి, అంబకంటితండాలో డ్రై డే నిర్వహించారు. ఈసందర్భంగా మండల ప్రత్యేకాధికారి మసార్‌రావు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం పల్లె ప్రకృతివనం, వైకుంఠ ధామం, డంపింగ్‌యార్డులతోపాటు వ్యవసాయ గోదాంలను పరిశీలించి సూచనలు చేశారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, కార్యదర్శులు సతీశ్‌కుమార్, ఉత్తమ్, వీవోఏలు పాల్గొన్నారు.

ఎఫ్‌పీవోలతో రైతులకు మేలు

కడెం: ఎఫ్‌పీవో (ఫార్మర్ ప్రొడ్యుసర్ ఆర్గనైజేషన్)లతో రైతులకు మేలు చేకూరుతుందని ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ క్లస్టర్ అధికారి సాదుల మౌనిక అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎఫ్‌పీవోల ఏర్పాటు, ఎఫ్‌పీవోలతో లాభలు తదితర అంశాలపై మండలంలోని కల్లెడ, నవబ్‌పేట్, చిట్యాల్, మద్దిపడగ, మాసాయిపేట్ గ్రామాల మామిడి రైతులకు అవగాహన కల్పించారు.అలాగే ఉపాధిహామీ పథకం ద్వారా ఉద్యాన పంటలకు వందశాతం సబ్సిడీ, బిందు సేద్యానికి 90 శాతం సబ్సిడీ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఏవో సంధ్యారాణి, రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ రమేశ్, తదితరులు ఉన్నారు.

ముధోల్‌లో ‘నా మట్టి- నా దేశం’

ముధోల్: మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ నాయకులు నామట్టి –నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఢిల్లీలో నిర్మించే అమృతవాటిక నిర్మాణం కోసం ముధోల్‌లో ఇంటింటికీ వెళ్లి మట్టి సేకరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కోరి పోతన్న, రాజు, లక్ష్మణ్, రవి, భూషణ్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవాలు జయప్రదం చేయాలి



నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఖానాపూర్: జిల్లా కేంద్రంలో ఈనెల 17న సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూతన్‌కుమార్ కోరారు. మంగళవారం పట్టణంలో వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ప్రతి గ్రామంలో వారోత్సవ సభలు నిర్వహించాలని కోరారు. నర్సయ్య, శంభు, వర్మ, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని భీమ్, రాంజీగోండి విగ్రహాల నుంచి కురన్నపేట్‌లో వెయ్యి ఉరుల మర్రి వరకు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల విగ్రహాలకు, వెయ్యిఉరుల మర్రి వద్ద అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి విలాస్, సాయి పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలతో భూగర్భజలాలు వృద్ధి

పెంబి: భూగర్భజలాలు పెరిగేందుకు ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని డీఎల్‌పీవో రమేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు మందపల్లి, నాగాపూర్, ఇటిక్యాల్, లోతర్యతాండ గ్రామాల్లో ఆయన పర్యటించారు. నీరు నిల్వకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు, సర్పంచ్‌లు, కార్యదర్శులు ఉన్నారు.

తానూరు: మండలంలోని హిప్నెల్లి గ్రామంలో ఇంకుడుగుంతల నిర్మాణాలను మంగళవారం ఈజీఎస్ ఏపీవో గంగాధర్ పరిశీలించారు. ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భజలాలు వృద్ధి చెందుతాయని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. హరితహారంలో నాటిన మొక్కలు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట కార్యదర్శి దత్తారెడ్డి, ఎఫ్ఏ సంజీవ్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆయిల్‌పాం సాగుతో లాభాలు

నర్సాపూర్(జి): ఆయిల్ పాం సాగుతో రైతులు లాభాలు పొందవచ్చని కంపెనీ ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కుస్లీలో మంగళవారం రైతులకు ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పించారు. ఏఈఓ భాగ్యలక్ష్మి, క్లస్టర్ ఆఫీసర్ క్రాంతి, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నామినీ వివరాలు సేకరణ

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన ఉపాధి కూలి పడిగెల రాజేశ్వర్ పని ప్రదేశంలో మృతి చెందాడు. మంగళవారం డీఆర్డీఏ ఏపీడీ వోస ప్రసాద్ బాధితుడి ఇంటికి వెళ్లి పలు వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఆయన పేర్కొన్నారు. రాజేశ్వర్ భార్య రాజమణి, ఉపసర్పంచ్ లక్ష్మణ్ ఉన్నారు.

పారిశుధ్యం పనుల పరిశీలన

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామపంచాయతీలో చేపడుతున్న పారిశుధ్య పనులను ఎంపీవో నసిరుద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు పలు సూచనలు చేశారు.

ఓటుహక్కుపై అవగాహన

మామడ: మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద మంగళవారం గ్రామసభ నిర్వహించి ఓటుహక్కు, ఎన్నికల విధానంపై అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థులు వీధుల్లో ర్యాలీలు తీశారు. అనంతరం ఓటర్లకు సమావేశం నిర్వహించి ఎన్నికల ప్రాముఖ్యత వివరించారు. ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల అరెస్ట్

ఖానాపూర్: కలెక్టరేట్ ముందు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతున్నారని.. ఖానాపూర్‌లో పలువురు ఏఎన్‌ఎంలను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు మాట్లాడారు. కలెక్టరేట్ ముట్టడికి వైద్యశాఖలో పని చేసే డాటా ఆపరేటర్లు, ఫార్మసిస్టులు, ఎంఎల్‌టీలు సమ్మెకు పిలుపునిస్తే పోలీసులు తమకు అనాలోచితంగా అరెస్టు చేశారని ఏఎన్‌ఎంలు పేర్కొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ జెడ్పీఎస్‌ఎస్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ సహకారంతో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు, పలకలను పంపిణీ చేశారు. హెచ్‌ఎం వెంకన్న, వెంకట్‌రాజం, నరేందర్, రాజేందర్, కృష్ణ, రాము, అశోక్, రాజన్న తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన మహిళలు, ఉట్నూర్ మండలం గంగాపూర్‌కు చెందిన యువకులు జాన్సన్‌నాయక్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పట్టణంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఇంద్రానగర్ కాలనీలో ఉపాధ్యాయుడు అశోక్ మృతి చెందగా కుటుంబాన్ని పరామర్శించారు. వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా రుద్రాభిషేకం

ఖానాపూర్: పట్టణంలోని వాసవిమాత ఆలయంలో మంగళవారం లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. శ్రీనగరేశ్వర స్వామివారికి 30 రోజులుగా భక్తులు గోత్రనామాలతో రుద్రాభిషేకం చేస్తున్నారు. అర్చకులు అభిషేక్‌శర్మ, అన్వేష్‌శర్మ, ఆనంద్‌శర్మతోపాటు భక్తులు జితేందర్, మాధవి, గీతారాణి, సరిత, రాధిక, రాజేందర్, హరికృష్ణ, శేఖరయ్య, అశోక్ తదితరులు ఉన్నారు.

సోయా పంట పరిశీలన

ముధోల్: మండలంలోని ఆష్టా గ్రామంలో మంగళవారం సోయా పంటలను ఏఈవో ఓంప్రకాశ్.. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. సాగులో పాటించాల్సిన మెళకువలను వివరించారు. వారి వెంట పలువురు రైతులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

కుంటాల: మండలంలోని కల్లూర్ గ్రామానికి చెందిన ముస్కు అనిరుధ్‌కు రూ.1లక్షా 50 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. మంగళవారం కల్లూర్‌లో చెక్కును నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, రమణ గౌడ్, పురుషోత్తం,దశరథ్, సాయికుమార్ పాల్గొన్నారు.

నేడు చెక్కులు పంపిణీ

లోకేశ్వరం: మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం ఉదయం 11 గంటలకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పంపిణీ చేస్తారని తహసీల్దార్ మోతీరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పశువులకు టీకాలు

ముధోల్: మండల కేంద్రంలో మంగళవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలను వేశారు. పశువైద్యాధికారి ఎస్.రాజేశ్, ఎంపీటీసీ దేవోజీ భూమేశ్, సిబ్బంది రైతులు ఉన్నారు.

51 మంది మహిళలకు వైద్యపరీక్షలు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో మొదటి రోజైన మంగళవారం 51 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యురాలు ప్రత్యూష తెలిపారు. ఇద్దరిని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కడెం: మండలంలోని పాతమద్దిపడగలో ఉపసర్పంచ్ పంజాల రామాగౌడ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. పలువురు గ్రామస్తులకు కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి నరేశ్ తదితరులున్నారు.

14న రక్తదాన శిబిరం

ఖానాపూర్: పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాలులో ఈ నెల14న జననీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సభ్యులు తోట సుమిత్, వెంకట్ మహేంద్ర తెలిపారు. మంగళవారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో రక్తదాన శిబిరానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. రాజేందర్, రామునాయక్, శ్రీనివాస్, వెంకట్, వీరేశ్ తదితరులున్నారు.

రక్తదానం

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో సునీత అనే మహిళకు ఆపరేషన్ నిమిత్తం ఏ పాజిటివ్ రక్తం అవసరమైంది. తనది అదే గ్రూప్ కావడంతో ఆరోగ్య శ్రీ టీమ్ లీడర్ వ్యాస్ రక్తదానం చేశారు.

సత్కారం

కడెం: ఉత్తమ సేవలకు గుర్తింపుగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ లో సర్పంచ్ బొడ్డు గంగన్న ఘనంగా సన్మానించారు. రాష్ట్ర అవార్డు అందుకున్న నచ్చన్ ఎల్లాపూర్ గురుకులం అధ్యాపకుడు లక్ష్మీనారాయణ, జిల్లా అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు భీమలింగం, శోభన షిండేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్యాంసుందర్, ఏపీవో జయదేవ్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుడు కిషన్ నాయక్, కార్యదర్శి రమాదేవి తదితరులు ఉన్నారు.

స్తంభం తొలగించాలని వినతి

ఖానాపూర్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాన్ని తొలగించాలని కోరుతూ కాలనీవాసులు స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. రోడ్డు మధ్యలో స్తంభం ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.